క్లుప్తంగా

రక్తదానం



రక్తదానంలో పాల్గొన్న ఎస్‌బీఐ ఉద్యోగులు

ఆదోని అర్బన్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) 70వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని మెయిన్ బ్రాంచ్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సామాజిక బాధ్యతలో భాగంగా బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు, స్థానికులు మొత్తం 35 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. బ్రాంచ్ మేనేజర్ ప్రసాదరావు, బ్యాంకు ఎస్‌యూఏసీ రీజినల్ సెక్రటరీ రవికుమార్, ఆర్గనైజేషన్ సెక్రటరీ రాజశేఖర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 70 వేల యూనిట్ల రక్త సేకరణను లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఉద్యోగులు మల్లేష్, సురేంద్ర, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్

నందవరం: విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పూలచింత గ్రామంలోని ఎంపీపీ పాఠశాల ఆవరణలో విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ మృతి



హనుమంతమ్మ(ఫైల్)

నందవరం: మండల పరిధిలోని ముగతి గ్రామంలో మాజీ ఎంపీపీ ఈ. హనుమంతమ్మ(92) వృద్ధాప్యం, అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఈమె నందవరం ఎంపీపీగా 2001 నుంచి 2004 వరకు సేవలు అందించారు. మృతదేహానికి ముగతి గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరుపాక్షిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం అధికార ప్రతినిధి గడ్డం నారాయణరెడ్డి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు, మాధవరావు దేశాయ్, గురురాజురావు దేశాయ్, రైస్‌మిల్లు నారాయణ రెడ్డి ఉన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత భోజనం



భోజనం వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: డీఎస్సీ అభ్యర్థులకు బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం అందిస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంకే శివ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో డీఎస్సీ శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ఉచిత మధ్యాహ్న భోజనాన్ని పార్టీ నాయకులు వడ్డించారు. కార్యక్రమంలో పార్టీ 18, 2వ వార్డ్ ఇన్‌చార్జ్‌లు సోమేష్, చంద్రశేఖర్, పార్టీ నాయకులు పాలశ్రీనివాసరెడ్డి, పామయ్య, కటికె నబి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనదారుడికి డ్రంకెన్‌డ్రైవ్ టెస్టు చేస్తున్న పోలీసులు

ఆదోని అర్బన్: పట్టణంలోని భీమా సర్కిల్‌లో విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టి డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేపట్టినట్లు ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు తెలిపారు. పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించి, కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వంటావార్పుతో కార్మికుల నిరసన



ఎమ్మిగనూరుటౌన్: సమస్యల పరిష్కారం కోసం 38 రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట వంటవార్పు చేశారు. దీక్షా శిబిరంలో భోజనాలు చేసి ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని యూనియన్ అధ్యక్షుడు నారాయణ అన్నారు. కార్మికులకు ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మహేంద్ర సంఘీభావం తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



మాట్లాడుతున్న కమిషనర్, చైర్‌పర్సన్, హెల్త్ ఆఫీసర్



సమావేశానికి హాజరైన పొదుపు మహిళలు, ఆర్పీలు, సీవోలు

ఆదోని టౌన్: పొదుపు సంఘాల మహిళలు గత కొన్నేళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలపై ఆర్పీలు, సీఓలు, ఐకేపీ మెప్మా అధికారులు కృషి చేయాలని చైర్‌పర్సన్ బోయ లోకేశ్వరి, మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ కోరారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో పొదుపు మహిళలకు రుణాల మంజూరు, రికవరీలు, గ్రూపు సంఘాల్లో నెలకొన్న ఆర్థిక విబేధాలు, గ్రూపు తగాదాలు తదితర వాటిపై చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.వారు మాట్లాడుతూ..బ్యాంకు లింకేజీల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించేలా పొదుపు సంఘాల మహిళలు, పీవోలు, ఆర్పీలు చొరవ తీసుకోవాలని కోరారు. జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం ప్రోత్సాహకరంగా రూ.35 వేలు ఇస్తోందని, అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.35 వేలను ప్రభుత్వం మంజూరు చేస్తుందని, పనులు ప్రారంభం నుంచి మూడు దశల్లో చెల్లిస్తుందన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లకు అందుబాటులోని సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆదివారం పట్టణంలో 25 వేల మందితో యోగా కార్యక్రమం నిర్వహించనున్నామని, అందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు.

స్వచ్ఛ ఆదోనిగా తీర్చిదిద్దుదాం

పట్టణాన్ని స్వచ్ఛ ఆదోనిగా తీర్చిదిద్దుదామని, అందుకు పట్టణ ప్రజల సహకారం అవసరమని మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి, కమిషనర్ ఎం.కృష్ణ అన్నారు. శుక్రవారం చైర్‌పర్సన్ బోయ లోకేశ్వరి ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆదోనిపై సమావేశాన్ని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. వివిధ రంగాల వ్యాపారులు, బీడీ బంకులు, మద్యం షాపుల నిర్వాహకులు, హోటళ్ల అసోసియేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు. కమిషనర్, చైర్‌పర్సన్ మాట్లాడారు. గాంధీ జయంతి నాటికి ఆదోనిని స్వచ్ఛ ఆదోనిగా తీర్చిదిద్దుదామని, ఇందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రధానంగా వ్యాపారులు, చిరు వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకులు వ్యర్థ పదార్థాలు, చెత్తాచెదారాన్ని, కాలువల్లో వేసి అపరిశుభ్రం పాలు చేయవద్దని, మున్సిపల్ శానిటరీ సెక్షన్ ఆటోల్లో వేయాలన్నారు.

వేలంలో రూ.8.69 లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

నందవరం: గురజాల రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో శుక్రవారం ఈఓ రాంప్రసాద్, పర్యవేక్షణ అధికారి సాయి ఆధ్వర్యంలో ఆలయ భూములకు వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతులు పరమేష్, ఈశ్వరరెడ్డి, యల్లప్ప, హనుమంతు, రాముడు, జయరాముడు, నరసింహులు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొన్నారు. హనుమంతు, యల్లప్ప, రాముడు, జయరాముడు, పరమేష్, ఈశ్వరరెడ్డి హెచ్చుగా పాడి ఆలయ భూములను కౌలుకు దక్కించుకున్నారు. గురజాల రామలింగేశ్వర స్వామి ఆలయ భూములకు సంబంధించి 94.26 ఎకరాలకు వేలం నిర్వహించగా రూ.8.69 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ తెలిపారు. గ్రామ పెద్దలు నరసింహారెడ్డి, శివారెడ్డి, రాజేష్‌రెడ్డి, చిన్న నరసింహులు పాల్గొన్నారు.

డయాగ్నోస్టిక్ సెంటర్ తనిఖీ



యాపిల్ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని యాపిల్ డయాగ్నోస్టిక్ సెంటర్ ల్యాబ్‌ను ఆదోని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి తనిఖీ చేశారు. ఇటీవల ల్యాబ్ తనిఖీ చేసినప్పుడు ల్యాబ్ యజమానితో పాటు రికార్డులు లేకపోవడంతో అధికారులు పరిశీలించలేదు. శుక్రవారం ల్యాబ్‌లో అన్ని పరికరాలు, రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డయాగ్నోస్టిక్ సెంటర్‌కు అన్ని రకాల అనుమతులున్నాయని తెలిపారు. పట్టణంలోని ల్యాబ్‌లు, ప్రైవేట్ నర్సింగ్ హోంలు, స్కానింగ్ సెంటర్ల యజమానులు తప్పనిసరిగా అన్ని రకాల అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం



చల్లకూలూరులో ధార్మిక కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

ఎమ్మిగనూరుటౌన్: ప్రతి మనిషికి ఆధ్యాత్మిక చింతన అవసరమని.. అప్పుడు మానసిక ప్రశాంతత, వ్యక్తిత్వ వికాసం సాధ్యమని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. మండల పరిధిలోని చల్లకూలురు గ్రామంలోని శివాలయంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు గోపూజ, కుంకుమార్చన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మూలింటి శాంతమ్మ, మాధవస్వామి, మాజీ సర్పంచ్ లక్ష్మన్న, భజన మండలి అధ్యక్షుడు నల్లన్న, అర్చకుడు రామాంజినేయులు పాల్గొన్నారు.

స్పిన్నింగ్ మిల్ యాజమాన్యంతో కార్మికుల చర్చలు



చర్చల్లో పాల్గొన్న యాజమాన్యం, కార్మిక సంఘాల నాయకులు

ఆదోని రూరల్: పట్టణంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో రాయలసీమ స్పిన్నింగ్ మిల్ కార్మికులకు రావాల్సిన పీఎఫ్, పింఛన్‌పై యాజమాన్యంతో చర్చలు జరిపారు. శుక్రవారం ఆదోని బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎస్.కె.జీవన్‌సింగ్ కార్యాలయంలో రాయలసీమ స్పిన్నింగ్ మిల్ యాజమాన్యం భాస్కర్‌రెడ్డి ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకప్ప మిల్లు కార్మిక నాయకులో కలిసి చర్చలు జరిపారు. మిల్లు యాజమాన్యం కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ కడప పీఎఫ్ కమిషనర్ దగ్గర జూలై మొదటి వారంలో యాజమాన్యం, ఎల్.కె.జీవన్‌సింగ్, కార్మిక సంఘం నాయకులు అందూ కలిసి పరిష్కారం చేద్దామని హామీ ఇచ్చారు. నాయకులు నారాయణ, వీరన్న, ఖాదర్, భీమలింగప్ప, కార్మికులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి

ఎమ్మిగనూరుటౌన్: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అనీఫ్, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఏసేపు డిమాండ్ చేశారు.

శుక్రవారం పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో వారు మాట్లాడారు. ఉచిత ఇసుక, మహిళలకు మూడు ఉచిత సిలిండర్ల హామీని సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంత పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ఇచ్చిన హామీపై ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

ఆదోని టౌన్: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారానికి పదో రోజుకు చేరింది. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు కుమారుడు భూపాల్‌చౌదరి సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మీ డిమాండ్లను మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు.

రెసిడెన్షియల్ పాఠశాలను ప్రారంభించాలి



రెసిడెన్షియల్ పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: మండలంలోని ఆరేకల్ గ్రామంలోనున్న మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను వెంటనే ప్రారంభించాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ (ఆర్‌ఏవీఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, ఖాజా డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విద్యార్థులతో కలిసి పాఠశాల ఎదుట ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ రెసిడెన్షియల్ భవనాలు పూర్తయ్యి యేళ్లు గడుస్తున్నా ఇంతవరకు ప్రారంభించకపోవడం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కోట్లాది రూపాయల ప్రజాధనం ఖర్చు పెట్టి పేద విద్యార్థుల కోసం నిర్మించిన రెసిడెన్షియల్ పాఠశాలను కూటమి ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని కోరారు. నాగేంద్ర, మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

నవ వధువు ఆత్మహత్య

ఎమ్మిగనూరురూరల్: కాళ్లపారాణి ఆరక ముందే నవ వధువు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండల పరిధిలోని కోటేకల్ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన కన్నయ్య రాజేశ్వరి(21)ని అదే గ్రామానికి చెందిన హనుమంతు అనే వ్యక్తికి ఇచ్చి రెండు నెలల క్రితం వివాహం జరిపించారు. ముందు నుంచి తనకు పెళ్లి ఇష్టం లేదని రాజేశ్వరి కుటుంబ సభ్యులకు చెబుతున్నా, పెద్దలు సర్ది చెప్పి పెళ్లి చేశారు. వారం క్రితం ఆమె పుట్టింటికి వచ్చింది. ఏరువాక పౌర్ణమి పండగకు భర్త హనుమంతు అత్తవారింటికి వచ్చాడు. శనివారం ఉదయం తనతో పాటు ఇంటికి వెళ్దామని భార్యతో చెప్పాడు. దీంతో ఇష్టం లేని భర్త ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొద్దిసేపటికి గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పెళ్లి ఇష్టం లేకనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు చెప్పారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

కౌతాళం: మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంఈఓ శోభారాణి అన్నారు. శుక్రవారం ఆమె కౌతాళంలోని కన్నడ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం అమలును పరిశీలించారు. మోను ప్రకారం వంటలు వండాలని, నాణ్యత లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.అలాగే ఆరెకల్ ఏపీ రెసిడెన్సీ పాఠశాలకు మదిర గ్రామ పాఠశాల విద్యార్థినులు అఖిల, అఖిలశ్రీ అనే ఇద్దరు విద్యార్థినులు ఎంపికైనట్లు తెలిపారు.

కోర్టు తీర్పుపై హర్షం

ఆదోని రూరల్: 2018 సెప్టెంబర్ 13న పట్టణంలోని భీమాస్ సర్కిల్‌లో ఆటోలతో ర్యాలీ చేసిన సీపీఎం, సీపీఐ, వైఎస్సార్‌సీపీ నాయకులపై పోలీసులు అప్పట్లో కేసులు నమోదు చేశారు. శుక్రవారం జరిగిన విచారణలో కోర్టు కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. 20 మంది ఆటో డ్రైవర్లు, ఆరుగురు నాయకులపై అప్పట్లో పోలీసులు పెట్టిన కేసులు కొట్టి వేశారని నాయకులు మహబూబ్‌బాషా, దిలీప్, గడిగే వెంకటేశ్వర్లు, బోయ వీరేష్ హర్షం వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరెడ్డి, సీపీఐ నాయకులు టి.వీరేష్, వైఎస్సార్‌సీపీ నుంచి జైభీమ్ సాయిరామ్, మునిస్వామిపై పెట్టిన కేసును జడ్జి కొట్టివేశారన్నారు. అప్పట్లో శాంతియుతంగా ఆటో ర్యాలీ చేస్తే తప్పుడు కేసులు బనాయించారని ఆరోపించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోని అర్బన్: రెండో శనివారం సందర్భంగా 33/11కేవీ సబ్‌స్టేషన్లు, విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ షెడ్యూల్ ఉండటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఇన్‌చార్జ్ డీఈ పురుషోత్తం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదోని పట్టణం, చుట్టుపక్కల గ్రామాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మద్యం విక్రేత అరెస్ట్

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో కర్ణాటక మద్యం అక్రమంగా విక్రయిస్తున్న నక్కల సునీల్‌ను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్ శుక్రవారం తెలిపారు. నిందితుడి నుంచి 120 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. అదే గ్రామానికి చెందిన మద్యం సరఫరాదారుడైన నక్కల సురేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ఆదోని రూరల్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాధాకృష్ణ విమర్శించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందన్నారు. పట్టణంలో జనాభాకు అనుగుణంగా తాగునీటి సమస్యను పరిష్కరించడం లేదన్నారు. కూలడానికి సిద్ధంగా ఉన్న పాత ఫ్లై ఓవర్ బ్రిడ్జికి మరమ్మతులు చేయడంలోనూ, కొత్త బ్రిడ్జి ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. అలాగే.. వార్డుల్లో సమస్యలు తిష్టవేశాయని, పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు లక్ష్మన్న, గోపాల్, తిప్పన్న, వెంకటేష్, ఖాన్ పాల్గొన్నారు.

ఎల్‌ఎల్‌సీకి నీరు విడుదల చేయాలి

ఆదోని రూరల్: తుంగభద్ర డ్యాం నుంచి ఎల్‌ఎల్‌సీకి నీరు విడుదల చేయాలని తెలుగు రైతు కర్నూలు జిల్లా అధికార ప్రతినిధి పి.సాయిబాబా ఎస్‌ఈని కోరారు. ఈ మేరకు శుక్రవారం కర్నూలులో ఎస్‌ఈని కలిసి విన్నవించారు. పి.సాయిబాబా మాట్లాడుతూ ముందస్తు వర్షాలతో తుంగభద్ర డ్యాంకు భారీగా వరద నీరు వచ్చి చేరిందని, సకాలంలో కాలువకు నీటిని విడుదల చేయాలని కోరారు. ఎస్‌ఈ స్పందిస్తూ.. తుంగభద్ర డ్యాం అధికారులతో చర్చించి నీరు విడుదలయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

విద్యుదాఘాతంతో ఇద్దరికి గాయాలు



గాయపడిన మల్లికార్జున , పరశప్ప

ఆదోని అర్బన్: ఆస్పరి మండలం చిన్నహోతూరు గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో ఆర్పేందుకు వెళ్లిన ఇద్దరికి శుక్రవారం గాయాలయ్యాయి. బాధితులు, ఔట్‌పోస్టు కానిస్టేబుల్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మల్లికార్జున, పరశప్ప గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు చెలరేగడంతో ఆర్పేందుకు వెళ్లగా విద్యుత్‌షాక్‌కు గురై గాయాలపాలయ్యారు. స్థానికులు వెంటనే ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

ఆదోని అర్బన్: వైఎస్సార్‌సీపీ ఆదోని మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్లు కేంద్ర కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఆదోని మండల యూత్ వింగ్ అధ్యక్షుడిగా సోమేశ్వరరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు గుమ్మల అంకిత, రైతు విభాగం అధ్యక్షుడిగా కె.గర్జప్ప, బీసీ సెల్ అధ్యక్షుడిగా బి.సోమలింగ, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కెంగారు నాగప్ప, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా ఎరుకల మారేష్, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్‌సలాం, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా మాదిగ ఉచ్చీరప్ప, పంచాయతీ రాజ్ వింగ్ అధ్యక్షుడిగా లేమనె నాగరాజు అలియాస్ మీసేవ నాగరాజు, ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షుడిగా బింగి పూజారి వీరేష్, వలంటీర్స్ వింగ్ అధ్యక్షుడిగా గంధాల ప్రణయ్‌కుమార్, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా కె.హుల్లెప్ప, సోషల్ మీడియా అధ్యక్షుడిగా సన్నకోల విజయరాజ్, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడిగా గంధాల వినోద్‌కుమార్, ఇంటెలెక్చువల్స్ ఫోరం అధ్యక్షుడిగా ఎస్.హనుమంతు, బూత్ కమిటీస్ వింగ్ అధ్యక్షుడిగా మెడికల్ నాగరాజు, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా సూరిపోగు ప్రతాప్‌ను నియమించారు.

కౌలు రైతులపై కపట ప్రేమ తగదు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

ఆదోని రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌలు రైతులపై కపట ప్రేమ చూపిస్తున్నాయని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ, సీపీఐ మండల కార్యదర్శి కల్లుబావి రాజు విమర్శించారు. శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ భూమిలేని కౌలు రైతులు జీవనాధారం దుర్భరంగా మారిందన్నారు. కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 90 శాతం రాయితీతో నాణ్యమైన అన్ని రకాల సాగు విత్తనాలను ఇవ్వాలని కోరారు. భూ యజమానితో సంబంధం లేకుండా ప్రతి కౌతు రైతుకు కౌలు కార్డు ఇవ్వాలన్నారు. నాయకులు గంగన్న, నగేష్, శంకరప్ప, ఈరన్న, మునియప్ప పాల్గొన్నారు.

పోరాటాల ఫలితమే ఎస్సీ వర్గీకరణ



పెద్దకడబూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

పెద్దకడబూరు: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ చేపట్టిన పోరాటాల ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ జరిగిందని ఆ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారి హనుమంతు, కో ఇన్‌చార్జ్ ముగతి ప్రతాప్‌కుమార్ అన్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎంపీ యువరాజు , సతీష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం నాయకుల, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మందకృష్ణ మాదిగ అడుగు జాడల్లో నడిచి ఎస్సీల అభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బొగ్గుల నరసన్న, ఏలియా, శౌరిరాజు, తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రకు స్థల పరిశీలన



మఠం మేనేజర్‌తో సమావేశమైన ప్రభుత్వాధికారులు

మంత్రాలయం రూరల్ : ఈనెల 18న మంత్రాలయం నియోజకవర్గ కేంద్రంలో యోగాంధ్ర కార్యక్రమం చేపట్టాలని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా నిర్ణయించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఏపీ టూరిజం జిల్లా అధికారిణి విజయ నేతృత్వంలో స్థానిక అధికారులు స్థల పరిశీలన చేశారు. రాఘవేంద్రస్వామి మఠం మేనేజర్ శ్రీనివాసరావుతో అధికారులు సమావేశమయ్యారు. శ్రీమఠం మధ్వ ద్వారం ప్రాంగణంలో యోగా నిర్వహించాలని కోరారు. అందుకు మేనేజర్ అనుమతులు ఇవ్వడంతో కారిడార్ ప్రాంతాన్ని పరిశీలించి యోగా కార్యక్రమం నిర్వహణకు అనుకూలంగా ఉన్నట్లు గుర్తించారు. సమీక్షలో తహసీల్దార్ ఎస్.రవి, ఎంపీడీవో నూర్జాహాన్, వీఆర్వో రామన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేద్దాం

కోసిగి: యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రమైన కోసిగి మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో యోగాంధ్రపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిర్వహించే యోగాంధ్రను ప్రజలందరికి తెలియజేయాలన్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు యోగా ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ హారున్ రషీద్, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరుగా వాన



రహదారిపైకి చేరుకున్న నల్లవాగు వంక నీరు

మంత్రాలయం రూరల్ : రెండు రోజులుగా మంత్రాలయంలో జోరుగా వానలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగి పారుతున్నాయి. స్థానిక నల్లవంకకు భారీగా వరద నీరు రావడంతో మంత్రాలయం–నాగలదిన్నె రోడ్డుపై నీరు చేరింది. దాదాపు గంటపాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వానలు కురవడంతో రైతులు పంట పొలాల్లో విత్తు వేసుకుంటూ కనిపించారు. రైతుల సందడితో పొలాలు కళకళలాడాయి.

చిలకలడోణలో క్షయవ్యాధి పరీక్షలు



గ్రామంలో అవగాహన కల్పిస్తున్న వైద్య బృందం

మంత్రాలయం రూరల్: టీబీ ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిలకలడోణ గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. కల్లుదేవకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డా.భావన నేతృత్వంలో గ్రామంలో టీబీ పరీక్షలు నిర్వహించారు. క్షయ అంటు వ్యాధి అని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మల్లికార్జున, ఎంఎల్‌హెచ్‌పీ తులసి, ఆరోగ్య కార్యకర్త అరుణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం

ఆదోని టౌన్: క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షెహనాజ్‌బాను, సూపర్‌వైజర్ బాబురాజు, టీబీహెచ్‌వీ సుబ్బమ్మబాయి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 7వ వార్డు కూణిముల్లా ప్రాంతంలో క్షయవ్యాధి నిర్మూలనపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వారు ప్రజలకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎంలు జరీనా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.